ముమ్మరంగా సీసీ రోడ్ల నిర్మాణం

- చండూరు, మునుగోడు మండలాలకు రూ.మూడు కోట్లు మంజూరు
- మార్చి 31 వరకు పనులు పూర్తి చేయాలని లక్ష్యం


కిష్టాపురంలో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్డు

మునుగోడు: ప్రభుత్వం మునుగోడు సబ్ డివిజన్‌కు మంజూరు చేసిన నిధులతో గ్రామాల్లోని వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వం ప్రతిఏటా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులను మార్చి మాసంలో కేటాయించేది. ఆ పనులను అదే నెలలో పూర్తిచేసేందుకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఇబ్బందులు పడేవారు. కానీ ఆ నిధులు ఈ ఏడాది జనవరి చివరి వారంలో కేటాయించడంతో ఇప్పటికే దాదాపు 70 శాతంకు పైగా సీసీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేశారు.

రూ. 3 కోట్లు మంజూరు

మునుగోడు సబ్ డివిజన్ పరిధిలోని రెండు మండలాలకు ప్రభుత్వం ఈ ఏడాది సీసీ రోడ్ల నిర్మాణానికి ఉపాధిహామీ నిధుల నుంచి రూ.3 కోట్లను జనవరి చివరి వారంలో మంజూరు చేసింది. అందులో మునుగోడు మండలంలోని 17 గ్రామాల్లో సీసీ రోడ్లు వేసేందుకు రూ.కోటి 50 లక్షలు, చండూరులోని 17 గ్రామాలకు రూ.కోటి 50 లక్షలు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు మునుగోడు మండలంలోని 13 గ్రామాల్లో రూ.1.20 కోట్ల విలువ గల పనులు, చండూరు మండలంలోని 5 గ్రామాల్లో రూ.50 లక్షల విలువ గల పనులు పూర్తి చేశారు. మిగిలిన పనులు ఈ నెల 31 తేదీ లోపు పూర్తిచేసి ఎంబీలు రికార్డు చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఆ పనులను సైతం పూర్తి చేయించేందుకు అధికారులు సర్వ ప్రయత్నాలు చేస్తున్నారు. మంజూరైన మొత్తం నిధులను సద్వినియోగం చేసుకోవాలని ప్రజాప్రతినిధులు చూస్తున్నారు. సీసీ రోడ్ల మంజూరుకు కృషిచేసిన స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

90 శాతం వీధుల్లో సీసీ రోడ్లు పూర్తిచేశారు



గతంలో ఎప్పుడు లేనివిధంగా మా గ్రామానికి జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధుల ద్వారా సీసీ రోడ్లు వేసేందుకు రూ.30 లక్షలు మంజూరయ్యాయి. నిధుల మంజూరుకు కృషి చేసిన స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కృతజ్ఞతలు. ఇప్పటికే ఆ నిధులతో పలు వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తిచేశారు. గ్రామంలోని దాదాపు 90 శాతం వీధుల్లో సీసీ రోడ్లు వేయడం పూర్తిచేశారు.

– జిట్టగోని సైదులు, మునుగోడు

పనులు త్వరగా పూర్తిచేయాలని సూచిస్తున్నాం

ఈ ఏడాది జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధుల ద్వారా మునుగోడు సబ్ డివిజన్ పరిధిలోని రెండు మండలాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అందులో ఇప్పటికే 70 శాతం పనులు పూర్తి చేశారు. మిగిలిన పనులు త్వరగా పూర్తి చేయాలని ఆయా గ్రామాల కాంట్రాక్టర్లకు సూచిస్తున్నాం. ప్రతి గ్రామంలో పనులు కొనసాగుతున్నాయి. మార్చి చివరి నాటికి నూరు శాతం పనులు పూర్తి చేయిస్తాం.

– బి. రఘుపతి, డీఈ మునుగోడు సబ్ డివిజన్

మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం


మాట్లాడుతున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : నకిరేకల్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం ఎమ్మెల్యే వేముల వీరేశం ఆధ్వర్యంలో ప్రజాపాలనకు వంద రోజులు–ప్రజానాయకుడికి 100 ప్రశ్నల పేరుతో పీపుల్స్ క్వశ్చన్ అవర్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా నియోజకవర్గ ప్రజలు, ప్రజాప్రతినిధులు, విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు. అభివృద్ధిలో ఆదర్శంగా ఉండడం కోసం ఒక విజన్ ఏర్పాటు చేశామని, త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామని తెలిపారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న బ్రాహ్మణ వెల్లంల, పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి పల్లి సాగు నీటి ప్రాజెక్టుల పనులు పూర్తి చేసి ప్రతి ఎకరాలకు సాగు నీరు అందేలా చర్యలు తీసుకుంటానని అన్నారు. నకిరేకల్, కట్టంగూరు, శాలిగౌరారం మండలానికి సాగు నీరు అందించే అయిటిపాముల లిఫ్ట్ పూర్తి చేస్తామన్నారు. నకిరేకల్ పట్టణాన్ని మోడల్‌గా మారుస్తానని అన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి వచ్చే జూన్ నుంచి ఉద్దీపన కార్యక్రమాన్ని అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు బచ్చుపల్లి శ్రీదేవి గంగాధర్‌రావు, జెల్లా ముత్తిలింగం, బీసీ ఫైనాన్స్ మాజీ చైర్మన్ పూజర్ల శంభయ్య, చామల శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లు గాజుల సుకన్య, కందాల భిక్షంరెడ్డి, గడ్డం స్వామి, యాసారం లక్ష్మీ, పన్నాల పావనిశ్రీనివాస్‌రెడ్డి, చౌగోని రజిత శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

వడ్డెర కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే వేముల వీరేశానికి వినతి పత్రం అందజేశారు. కోడిదల శ్రీనివాస్, ఆలకుంట్ల బచ్చయ్య, కంచం వెంకన్న, ఆలకుంట్ల సైదులు, సురేష్, విజయ్, ఓర్సు శ్రీను పాల్గొన్నారు.

క్లుప్తంగా

సేవారత్న అవార్డులు ప్రదానం


అవార్డు అందుకుంటున్న శివలీలారెడ్డి

కనగల్: మండల కేంద్రానికి చెందిన సామాజిక సేవకురాలు కంబాల శివలీలారెడ్డికి ఆదర్శ మహిళ, బోయినపల్లికి చెందిన ఆర్‌ఎంపీ భిక్షాల మహేష్ ఉత్తమ సేవా అవార్డులు అందుకున్నారు. బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఆలూరి కల్చరల్, సోషల్ ఆర్గనైజేషన్, ఫ్రెండ్షిప్ మినిస్ట్రీస్–తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యక్షుడు ఆలూరి విల్సన్, సినీ నటుడు మాణిక్ రావు, సినీ నిర్మాత గుర్రపు విజయ్ కుమార్ చేతుల మీదుగా వీరు అవార్డులు అందుకున్నారు. కార్యక్రమంలో ఇందిర, అరుణ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సాజిద్ అలీ మృతి తీరని లోటు

నల్లగొండ టూటౌన్ : కనగల్ జెడ్పీహెచ్ఎస్ పీడీ సాజిద్ అలీ మృతి వ్యాయామ ఉపాధ్యాయ సంఘానికి తీరని లోటని టీజీపీఈటీఏ సంఘం జిల్లా అధ్యక్షుడు కుంభం నర్సిరెడ్డి అన్నారు. బుధవారం పానగల్‌లోని సాజిద్ అలీ నివాసంలో అలీ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నర్సిరెడ్డి మాట్లాడుతూ సాజిద్ అలీ భార్య అనారోగ్యంతో కొద్ది రోజుల క్రితమే మృతి చెందడం, సాజిద్ అలీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో వారి పిల్లలు అనాథలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. నివాళులర్పించిన వారిలో రమావత్ నాగేశ్వర్‌రావు, రాజశేఖర్ రెడ్డి, కుతటి మురళి, ధర్మేందర్, షాహిద్, మల్లేశం, గడ్డం రవీందర్, వెంకటేశ్వర్లు, ఆజం బాబా, తాల్ల శ్రీను, శంభులింగం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

నల్లగొండ టౌన్ : యాసంగి సీజన్ వరికోతలు ప్రారంభమైనందున ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అన్ని గ్రామాల్లో కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరకు కొనుగోలు చేయడంతోపాటు వరికి బోనస్ కూడా చెల్లించాలన్నారు. జిల్లా స్థాయిలో ధాన్యం కొనుగోలుపై అన్ని పార్టీలు, మిల్లర్లు, రైతు సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా రాజేందర్‌నాయక్


నియామకపత్రం అందజేస్తున్న వర్షిత్‌రెడ్డి

మర్రిగూడ: మండల కేంద్రం శివారులోని తూర్పుతండాకు చెందిన పాత్లావత్ రాజేందర్ నాయక్ బీజేపీ మండల అధ్యక్షుడిగా నియమితులయ్యారు. బుధవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో రాజేందర్‌నాయక్‌కు పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజేందర్‌నాయక్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి, మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ యాస అమరేందర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

సంస్కృత భాషను విస్తరించాలి


మాట్లాడుతున్న డాక్టర్ సింధూర

నల్లగొండ టూటౌన్ : సంస్కృత భాషను విస్తరించాలని, దానిని పుస్తకాలకే పరిమితం చేయకూడదని డాక్టర్ సింధూర అన్నారు. స్థానిక ఆర్ఎస్ఎస్ కార్యాలయంలో బుధవారం సంస్కృత భారతి నల్లగొండ శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు, గృహిణులు, సంస్కృత భాషాభిమానులు, పత్రాలయ పరీక్షలు రాసేవారికి జరిగిన శిక్షణలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో బాల కేంద్ర శిక్షకురాలు పద్మావతి రామేశ్వరరావు, అధ్యక్షుడు మక్కపాటి శ్రీనివాస శర్మ, కార్యదర్శి ఉప్పల శ్రీరాములు, ఆచార్య శివ ,మేడిపల్లి లక్ష్మీ నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండకు ప్రథమ స్థానం

నల్లగొండ : తెలంగాణ ట్రాన్స్‌కో అండ్ డిస్కం ఇంటర్ సర్కిల్ టగ్ఆఫ్‌వార్, అథ్లెటిక్స్ టోర్నమెంట్ యాదగిరిగుట్టలో ఈ నెల 12 నుంచి 14 వరకు నిర్వహించారు. టగ్ఆఫ్‌వార్‌లో నల్లగొండ జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. అథ్లెటిక్స్ షార్ట్‌పుట్, జావలిన్‌త్రోలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించినారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


నల్లగొండ టౌన్ : అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రణీత


చిట్యాల: వనిపాకలలో గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అంగన్‌వాడీ టీచర్

నల్లగొండ టౌన్ : చిన్నారులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రణీత అన్నారు. బుధవారం నల్లగొండ పట్టణం రహమత్‌నగర్‌లోని 22వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన పోషణ పక్షోత్సవాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చిరు ధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. చిరుధాన్యాలు, మిల్లెట్స్, పోషకాహారం, ఆరోగ్యంపై చిన్నారులకు, గర్భిణులకు అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులకు, బాలింతలకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు గుత్తా జ్యోతి, కవిత, సావేదా, ఆయా రాజేశ్వరి, ఆశా వర్కర్లు సత్యవతి, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

పోషణ పక్వాడ కార్యక్రమం

చిట్యాల: మండలంలోని వనిపాకల, చిన్నకాపర్తి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు పోషకాహారంపై, చిరుధాన్యాల వినియోగంపై అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార పదార్థాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఆయా కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు మేడి జానమ్మ, బి.విజయలక్ష్మీ, బి.లింగమ్మ, కె.హేమలత పాల్గొన్నారు.

ప్రపంచ పక్షుల దినోత్సవం

చండూరు : గట్టుప్పల్ మండల పరిధిలోని తేరట్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో ప్రపంచ పిచ్చుకల (పక్షుల) దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పక్షులు నీటిని తాగి దప్పిక తీర్చుకునేందుకు పాఠశాలలో ఏపుగా ఎదిగిన చెట్లకు కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ డబ్బాలు కట్టి నీళ్లు పోశారు. ఎండాకాలంలో పక్షులకు నీళ్లు దొరకక అల్లాడతాయని ఇలా చెట్లకు డబ్బాలు కట్టి నీటిని నింపడం వల్ల పక్షులు వాటిని తాగుతాయని ఉపాధ్యాయుడు బాణావత్ లచ్చిరామ్‌నాయక్ తెలిపారు.

రాష్ట్ర ప్రయోజనాలే బీఆర్‌ఎస్ లక్ష్యం

మర్రిగూడ: రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా బీఆర్‌ఎస్ పార్టీ పనిచేస్తోందని రైతుబంధు సమితి మండల మాజీ కన్వీనర్ బచ్చు రామకృష్ణ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజా సమస్యలను పట్టించుకోని ప్రభుత్వంపై ఉద్యమించాలన్నారు. ఆయన వెంట చెరుకు శ్రీరాములుగౌడ్, రాపోలు యాదగిరి, నూన్సావత్ గోపినాయక్, జయప్రకాశ్, నవీన్ తదితరులు ఉన్నారు.

తిరందాసు గోపికి ఘన నివాళి


నల్లగొండ : గోపి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు


మునుగోడు : నివాళులర్పిస్తున్న కార్మికులు

నల్లగొండ టౌన్ : స్థానిక దొడ్డి కొమురయ్య భవన్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లా సీఐటీయు జిల్లా మాజీ అధ్యక్షుడు తిరందాసు గోపి వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపి చిత్రపటానికి సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చినపాక లక్ష్మీనారాయణ, తుమ్మల వీరారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బండా శ్రీశైలం, పాలడుగు నాగార్జున, ఎండీ సలీం, బాణాల పరిపూర్ణచారి, దండంపల్లి సత్తయ్య, పుప్పాల మట్టయ్య, పోలే సత్యనారాయణ, అద్దంకి నరసింహ, సలివోజు సైదాచారి, అవురేషు మారయ్య, పల్లె నగేష్, దాసోజు ప్రభుచారి పాల్గొన్నారు.

మునుగోడులో..

మునుగోడు: సీఐటీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు తిరందాసు గోపి రెండో వర్ధంతిని మునుగోడులోని సీపీఎం కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపి చిత్రపటానికి సీఐటీయూ మండల కన్వీనర్ వరికుప్పల ముత్యాలు కార్మికులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. సీఐటీయూ మండల కార్యదర్శి యరసాని శ్రీను, వేముల లింగస్వామి, ఎర్ర అరుణ, నీల అండాలు, నూకల పెద్దమ్మ, వేముల విజయ్, వంపు యాదయ్య, నీరుడు రాజ్య లక్ష్మి, కొంక కమలమ్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడలో..

మర్రిగూడ: తిరందాసు గోపి 7వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. గుండెబోయిన నరసింహ, నాయకులు ఏరుకొండ లచ్చయ్య, వంపు ముత్తమ్మ, గ్యార యాదగిరి, నరసమ్మ, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లిలో..

నాంపల్లి : స్థానిక సీఐటీయూ కార్యాలయంలో కార్మిక నేత తిరందాసు గోపి వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, గాదెపాక మరియమ్మ, వైష్ణవి, రాములమ్మ, పార్వతమ్మ, ఈరమ్మ, వెంకటేష్, రవితేజ, జలందర్, హరికృష్ణ పాల్గొన్నారు.

కనులపండువగా స్వామివారి రథోత్సవం


కనగల్ : రథోత్సవంలో పాల్గొన్న గ్రామస్తులు


చిట్యాల: పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వీరేశం

కనగల్: మండలంలోని రేగట్టె గ్రామంలో బుధవారం శ్రీ భవాని శంకర స్వామివారి రథోత్సవం కనులపండువగా జరిగింది. భక్తులు రథాన్ని లాగేందుకు పోటీలు పడ్డారు. ముందుగా స్వామి–అమ్మవార్లను వేదపండితులు అభిషేకించి, అందంగా అలంకరించి రథంపై ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గంజి చంద్రమౌళి, కార్యదర్శి దొమ్మటి అంజయ్య, కోశాధికారి కర్నాటి శ్రీనివాసులు, గంజి ముత్యాలు, కారింగు సతీష్, పులకరం ఎల్లప్ప, పులకరం లక్ష్మయ్య, తిరందాస్ రామలింగం,రావుల వెంకటేశం, పిచ్చయ్య, విజయ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: పెద్దకాపర్తి గ్రామంలోని శ్రీ తిరుమలనాథ స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవంలో భాగంగా బుధవారం రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టివేత


శాలిగౌరారం : పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

శాలిగౌరారం: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శాలిగౌరారం మండలంలోని మాధారంకలాన్ గ్రామానికి చెందిన కట్ట ప్రవీణ్, భువనగిరికి చెందిన కుల్సోతు నరేశ్‌తో కలిసి మాధారంకలాన్ నుంచి డీసీఎం వాహనంలో 211 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నాడు. పక్కా సమాచారంతో పోలీసులు మండలంలోని చొల్లగూడెం వద్ద పోలీసులు పట్టుకున్నారు. అనంతరం డీసీఎంను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం నకిరేకల్ పౌరసరఫరాలశాఖ డిప్యూటీ తహసీల్దార్ జ్యోతికి సమాచారం ఇచ్చారు. పట్టుబడిన 102 క్వింటాళ్ల బియ్యాన్ని శాలిగౌరారం పంచాయతీ కార్యదర్శి విజయ్ సమక్షంలో పంచనామా నిర్వహించారు. సీజ్‌చేసిన బియ్యాన్ని నకిరేకల్‌లో గల ఎంఎల్ఎస్‌కు తరలించారు. నిందితులు కట్ట ప్రవీణ్, కుల్సోతు నరేశ్‌లపై 6ఏ కేసుతో పాటు ఐపీసీ 420 , ఈసీ(ఎసెన్షియల్ కమాడిటీ) యాక్ట్ 7 కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

నాంపల్లి మండలంలో..

నాంపల్లి : అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని బుధవారం తెల్లవారుజామున నాంపల్లి ఎస్ఐ లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని పస్నూర్ వద్ద పోలీసుల పట్టుకున్నారు. పస్నూర్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ వాహనంలో తరలిస్తున్న 25 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుబడ్డాయి. ఈ బియ్యాన్ని మహేశ్వరంలోగల రైస్ మిల్లుకు తరలిస్తున్న నాంపల్లికి చెందిన బొడ్డుపల్లి స్వామి, కడ్తల్ మండలం ఏకవాయిపల్లి గ్రామానికి చెందిన జెనిగల మహేష్, మహేశ్వరం శివలపై కేసు నమోదు చేశారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, వాహనాన్ని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేస్తా

నల్లగొండ టూటౌన్ : జిల్లాలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పిట్టల శ్రీనివాస్ అన్నారు. బుధవారం నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా పిట్టల శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఓబీసీల సంక్షేమం కోసం అనేక పథకాలు తీసుకువచ్చిందని అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండు ఎంపీ సీట్లు బీజేపీ గెలుస్తుందన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి, రావెళ్ల కాశమ్మ, వేణుకుమార్, అశోక్‌గౌడ్, రాములు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌ఓకు వినతి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్ : నల్లగొండ మండలం దండెంపల్లి గ్రామంలో లెదర్ పరిశ్రమ భూమిని పరిరక్షించాలని కోరుతూ మాదిగ చర్మకారుల లెదర్ పరిశ్రమల భూముల, దళిత అసైన్డ్ భూముల పరిరక్షణ కమిటీ రాష్ట్ర ప్రతినిధులు బుధవారం జిల్లా రెవెన్యూ అధికారిణి(డీఆర్‌ఓ) రాజ్యలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. లెదర్ పరిశ్రమకు కేటాయించిన భూములు ఎటువంటి అభివృద్ధికి నోచుకోక నిరుపయోగంగా ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం లెదర్ పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకుని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏకు సారయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొజ్జ సైదులు, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు గ్యార ఇంద్రమోహన్, మనోజ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


సైదులు కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ : పానగల్ ఒకటో వార్డుకు చెందిన దొడ్డి సైదులు అనారోగ్యంతో మృతి చెందాడు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బుధవారం సైదులు మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబసభ్యులకు రూ.50 వేల ఆర్థిక సహాయం అందించారు. బాధిత కుటుంబానికి అన్నివేళలా అండగా ఉంటామని మంత్రి కోమటిరెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ ఆలకుంట్ల నాగరాజు, వార్డు అధ్యక్షుడు ఓర్సు రమేష్, యూత్ అధ్యక్షుడు గదారి వినయ్, యాదయ్య ఆదినారాయణ, గోగుల జానయ్య, రాజు, బన్నె నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రూ.5.12 లక్షలు పట్టివేత

నార్కట్‌పల్లి : ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.5.12లక్షలను బుధవారం నార్కట్‌పల్లి పోలీసులు పట్టుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో భాగంగా నార్కట్‌పల్లి మండల పరిధిలోని పలు గ్రామాల్లో వాహనాలతో పాటు బెల్ట్ దుకాణాలను పోలీసులు తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా ఆధారాలు చూపని నగదు, మద్యం సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

టీబీ నివారణపై అవగాహన

మిర్యాలగూడ అర్బన్ : కేఏఎస్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మండలంలోని యాద్గార్‌పల్లిలో నిర్వహిస్తున్న శీతాకాల ప్రత్యేక శిబిరంలో భాగంగా క్షయ వ్యాధిపై ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా క్షయ వ్యాధి సూపర్‌వైజర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ 2023వరకు టీబీని అంతం చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంటే భారత దేశం అంతకు ఐదు సంవత్సరాలు ముందుగానే 2025 వరకు అంతం చేయాలని పిలుపును ఇవ్వడం జరిగిందన్నారు. సరైన పద్ధతిలో పూర్తికాలం చికిత్సతో ఆరు నెలల లోపు టీబీ తగ్గుతుందని, మాత్రలు వాడటం వలన టీబీని నియంత్రించవచ్చని, నిశ్చయ పోషన కింద కేంద్ర ప్రభుత్వం అందించే రూ.500 రూపాయలు చికిత్స కాలం పాటు జమచేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నర్సింగ్ కోటయ్య, ఐక్యూసి కో ఆర్డినేటర్ ఈ.రాంరెడ్డి, టీబి జిల్లా సూపర్‌వైజర్ శ్రీనివాస్, కవి, మంగమ్మ, ఎలిజిబెత్, లక్ష్మి, శశికళ పాల్గొన్నారు.

పన్ను చెల్లించకుంటే ఆస్తులు జప్తు చేస్తాం

మిర్యాలగూడ టౌన్ : ఆస్తి పన్ను బకాయిదారులు ఈనెల 31వ తేదీలోగా 90శాతం రాయితీపై ఆస్తి పన్ను చెల్లించాలని, లేకుంటే ఆస్తులను జప్తు చేస్తామని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ అన్నారు. పట్టణంలోని ఈదులగూడెంలో ఇండియన్ ఆయిల్ బంక్, నల్ల మిరియాలు, పాండు రంగయ్య ఆస్పత్రి, మనోహర్, కె శ్రీనివాస్‌లకు చెందిన వారు పెద్ద మొత్తంలో బకాయిలు ఉండటంతో బుధవారం నేరుగా కమిషనర్ రంగంలోకి దిగారు. వారి వద్దకు వెళ్లి ఆస్తి పన్నులను చెల్లించాలని కోరారు. ఆస్తులను జప్తు చేసేందుకు మున్సిపల్ అధికారులు సిద్ధం కాగా రెండు, మూడు రోజుల్లో చెల్లిస్తామని చెప్పడంతో వదిలేశారు.

ఆలయాలు ఆధ్యాత్మిక నిలయాలు


దేవతామూర్తుల విగ్రహాలకు పూజలు చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మాడుగులపల్లి : ఆలయాలు ఆధ్యాత్మిక నిలయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని మాచనపల్లి గ్రామంలో నిర్మించిన సీతారామ చంద్రస్వామి ఆలయంలో మంగళవారం దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుంద న్నారు. అద్భుతంగా ఆలయాన్ని నిర్మించుకున్న గ్రామస్తులను మంత్రి అభినందించారు. అంతకుముందు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సైతం ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంచర్ల కృష్ణారెడ్డి, నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, రేగట్టె మల్లికార్జున్ రెడ్డి, జడ్పీ ఫ్లోర్ లీడర్ పాశం రాంరెడ్డి, బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

తనిఖీలు ముమ్మరం చేయాలి


వాడపల్లి చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఆర్డీఓ

మిర్యాలగూడ : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాష్ట్ర సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలను ముమ్మరం చేయాలని ఆర్డీఓ శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం దామరచర్ల మండలంలోని వాడపల్లి రాష్ట్ర సరిహద్దు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తెలంగాణ ప్రాంతంలోకి అక్రమంగా తరలించే మద్యం, నగదు వంటివి రాకుండా పటిష్ఠంగా తనిఖీలు చేపట్టాలన్నారు.అనంతరం ఆయా శాఖల అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ జవహర్‌లాల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

మర్రిగూడ : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలయ్యాయి. మర్రిగూడ మండల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నాంపల్లి మండలంలోని దామెర గ్రామానికి చెందిన బచ్చనబోయిన లక్ష్మయ్య బుధవారం లక్ష్మణాపురం నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో మర్రిగూడ మండలం బట్లపల్లి గ్రామ సమీపంలోకి రాగానే ఓ మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతడిని మర్రిగూడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బైక్‌ను కారు ఢీకొట్టడంతో..

మర్రిగూడ మండలంలోని గర్నగడ్డ గ్రామానికి చెందిన చేపూరి యాదయ్య బుధవారం సరంపేట నుంచి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. గ్రామ మూలమలుపు వద్ద లెంకలపల్లి నుంచి సరంపేటకు ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. యాదయ్యకు స్వల్ప గాయాలు కాగా స్థానికులు ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ పరారీలో ఉండగాకారును పోలీసులు స్వాధీనం చేసుకోని స్టేషన్‌కు తరలించారు.